క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపాలెం/తిరుమలాయపాలెం: రఘునాథపాలెం మండలంలోని 11 కేవీ వేపకుంట్ల విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రఘునాథపాలెం సెక్షన్ ఏఈ ఎ.ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెరువుకొమ్ము తండా, వేపకుంట్ల, చింతగుర్తి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే తిరుమలాయపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని తిరుమలాయపాలెం విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, గ్రానైట్ కస్టమర్లు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

రఘురాంరెడ్డిని కలిసిన శెట్టి



రఘురాంరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ఎంపీగా ఘన విజయం సాధించిన రామసహాయం రఘురాంరెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు బుధవారం కలిసి అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లమల వేణు, సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, పోచారం రఘురాంరెడ్డి తదితరులున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని మామిళ్లగూడెం సారథినగర్ మధ్యలో గల రైల్వే అండర్ బ్రిడ్జి పనులను బుధవారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాగండ్ల దీపక్ చౌదరి, శెట్టి రంగారావు తదితరులున్నారు.

నోరూరించే ఆవకాయ..!



మామిడి కాయల సీజన్ జోరుగా సాగుతోంది. మార్కెట్‌లో వివిధ రకాల మామిడి కాయలు లభిస్తుండడంతో విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మామిడి పండ్లను తినడానికి ఎంతలా ఇష్టపడతామో, అంతే ఇష్టంగా మామిడికాయ(ఆవకాయ) పచ్చడిని తినడానికి ప్రజలు ఇష్టపడతారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ ఏడాది మే, జూన్ మాసాల్లో మామిడి కాయ పచ్చడిని ఇంటింటా తయారు చేస్తుండగా ప్రస్తుతం చివరి దశకు చేరింది.

– ఖమ్మంవ్యవసాయం

పచ్చడి మామిడికి భలే గిరాకీ

- జోరుగా పచ్చడి మామిడి కాయల విక్రయాలు
- రకం, సైజును బట్టి ధరలు
- ఏడాది పొడవునా నిల్వ ఉండేలా తయారు చేస్తున్న వైనం
- ప్రతి ఇంటా పచ్చడి ఘుమఘుమలే..



ఖమ్మం కాల్వొడ్డులో పచ్చడి మామిడి కాయలను కొనుగోలు చేస్తున్న మహిళలు



మామిడి ముక్కలను కలుపుతున్న మహిళ

ఎక్కువ కాలం నిల్వ ఉండేలా..

ఎక్కువ కాలం నిల్వ ఉండే పచ్చడి కాయల కోసం కొందరు తోటల వద్ద, ఇంకొందరు మార్కెట్‌ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ గ్రామంలో పచ్చడి మామిడి కాయలు లభిస్తుండగా.. నగరంలో కాల్వొడ్డు, కూరగాయాల పెద్ద మార్కెట్ వద్ద లభిస్తున్నాయి. జలాలు, తెల్ల గులాబీలు, రసాలు, నీలాలు, నాటు కాయలు వంటి రకాలను పచ్చడిగా పెట్టుకుంటారు. ఇవి ఎక్కువగా నూజివీడు, విసన్నపేట, సత్తుపల్లి, అశ్వారావుపేట, కల్లూరు, తల్లాడ, మధిర, ముదిగొండ, తిరుమలాయపాలెం, చింతకాని, కూసుమంచి, రఘునాథపాలెం తదితర మండలాల్లో ఎక్కువగా లభిస్తుంటాయి. కాగా, పచ్చడి తయరీకి అవసరమైన కారం, ఆవ పిండి, ఉప్పు, ఎల్లిపాయలు, పసుపు, మెంతులు, నూనె తదితరాలను సిద్ధంగా ఉంచుకొని పచ్చడి పెట్టుకుంటున్నారు. కొందరు ఏడాది పొడవునా వినియోగించుకునేందుకు పెద్ద పెద్ద జాడీల్లో పచ్చడిని నిల్వ బెడుతున్నారు.

రకం, సైజు ఆధారంగా ధరలు..

పచ్చడి మామిడి కాయల రకం, సైజు ఆధారంగా ధరలను నిర్ణయించి విక్రయిస్తున్నారు. నూజివీడు, విసన్నపేటలకు చెందిన మామిడి కాయలకు డిమాండ్ ధర ఉంటుంది. ఈ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన జలాలు రకం ఒక్కో మామిడి కాయ రూ.40లు ఉండగా, తెల్లగులాబీ రూ.30లు, చిన్న రసాలు రూ.20లు, నీలాలు రూ.15లు, నాటు కాయ రూ.10ల వరకు విక్రయిస్తున్నారు. కాయ సైజు తగ్గితే ధర కొంత మేరకు తగ్గుతుంది.

అంతా ఒకే చోట..



కాయలను ముక్కలుగా కట్ చేస్తున్న దృశ్యం

పచ్చడి కాయలు కొనుగోలు చేసే చోటే ఆ కాయలను శుభ్రం చేయడం, తుడవటం, ఆరబెట్టడం, కోరుకున్న సైజులో ముక్కలు కట్ చేయడం వంటి అన్ని పనులు చేసి అప్పగిస్తున్నారు. కాయ ధర గాక ఇతర చార్జీలను ఒక్కో కాయకు సైజును బట్టి రూ. 5 నుంచి రూ.8ల వరకు తీసుకుంటున్నారు.

పచ్చడి ప్రత్యేకం..



మామిడి కాయ పచ్చడిని ఏడాది పాటు నిల్వ ఉండేలా ప్రత్యేకంగా పెడతాం. నాటు, జలాలను పచ్చడికి ఎంచుకుంటాం. ఇక్కడ తయారు చేసిన పచ్చడిని తమతో పాటు దేశ, విదేశాల్లో బంధువులు, మిత్రులకు పంపిస్తాం. అమెరికాలో ఉన్న కూతురు, బంధువుల కుటుంబాలు ఈ పచ్చడి కోసం ఎదురుచూస్తుంటారు. మామిడి నిల్వ పచ్చడి అంటే బాగా ఇష్టం.

– విసారపు నిర్మల, శ్రీనివాసనగర్

డిమాండ్ పెరిగింది..



ఈ ఏడాది ఈదురుగాలులు, అకాల వర్షాల కారణంగా పచ్చడి కాయలు రాలిపోయి కొరత ఏర్పడడంతో డిమాండ్ పెరిగింది. పచ్చడికి అవసరమైన వివిధ రకాల మామిడి కాయలను విక్రయిస్తాం. దెబ్బతిన్న కాయలను విక్రయిస్తే పచ్చడి చెడిపోతుంది. అందుకే చెట్టపైనే కాయలు కోసం అమ్ముతున్నాం. అంతేకాక కాయలు కడగటం, శుభ్రం చేయటం, ముక్కలుగా కట్ చేసి ఇస్తున్నాం.

– పుగాకుల రమ, విక్రయదారురాలు, కాల్వొడ్డు

మైనర్లు వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం: మైనర్లు వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే డ్రైవింగ్ చేసిన వ్యక్తితో పాటు వాహన యజమానిని కూడా న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గతంలో పట్టుబడిన మైనర్లను జరిమానాతో పాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని, ఇక నుంచి పట్టుబడితే వాహనాలను సీజ్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పట్టుబడిన 255 మైనర్ వాహనాలకు రూ.1,27,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

విత్తనాల కొరత రాకుండా చూడాలి



కూసుమంచిలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ వాణి

కూసుమంచి: మండలంలోని కూసుమంచి, చేగొమ్మ గ్రామాల్లో విత్తన దుకాణాలను బుధవారం ఏఓ రామడుగు వాణి తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. విత్తన దుకాణదారులు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని, రైతులకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలని, కంపెనీ అనుమతుల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించుకోవాలని ఆదేశించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువగా విత్తనాలు విక్రయించినా, విత్తన కొరత సృష్టించినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

'బడిబాట'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి బి.రాములు అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కానుండగా.. ఈ నెల 6 నుంచి 19 వరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, స్వయం సహాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. బడిలో చేరిన మొదటి రోజే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్, పాఠ్య పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌కు దీటుగా బోధన, నాణ్యమైన భోజనం, ఉచితంగా పుస్తకాలు అందిచనుండగా.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ప్రైవేట్'లో ఫీజులు నియంత్రించాలి



డీఐఈఓకు వినతిప్రతం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు గుర్తింపు లేకుండానే అడ్మిషన్ల ముసుగులో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అకాడమీల పేర్లతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని ఆరోపించారు. బుధవారం ఈమేరకు ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన డీఐఈఓ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ..కొన్ని సంస్థలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తరగతులు ప్రారంభించారని, మరికొన్ని విద్యా సంస్థలు అడ్మిషన్లు పూర్తయినట్లు బోర్డులు పెట్టి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు ఫీజుల నియంత్రించకపోతే సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగులమీర, శివ, వంశీ, హరికృష్ణ, సతీష్, నరేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణహితం.. అభిమతం

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

- మొక్కలు నాటిన ప్రభుత్వ, ప్రైవేట్ అధికారులు, యాజమాన్యాలు
- పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు



మొక్క నాటి నీరు పోస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

ఖమ్మంలీగల్: పర్యావరణ అసమతుల్యం కారణంగా పర్యావరణహితానికి మొక్కలు పెంచడమే ప్రధాన మార్గమని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ఖానాపురంలోని ఏడవ డివిజన్‌లో మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడడం కేవలం ప్రభుత్వాల బాధ్యతే అనుకోకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. న్యాయ సేవా సంస్థ సభ్యుడు, పర్యావరణవేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాది పి.బి శ్రీరాములు, న్యాయ సేవా సంస్థ సభ్యుడు కె.వేణుగోపాల్, గార్లపాటి నాగేశ్వరరావు, అన్నం శ్రీనివాసరావు, అన్నం అమరేశ్వరరావు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడివండి వేణుగోపాల్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.

మొక్కలు, జ్యూట్ బ్యాగుల పంపిణీ..



ర్యాలీలో స్పిరిచువల్ సొసైటీస్, మూమెంట్ ప్రతినిధులు, సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం స్పిరిచువల్ సొసైటీస్, మూమెంట్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన బుధవారం ఖమ్మంలో ప్రదర్శన, మొక్కలు, జ్యూట్ బ్యాగుల పంపిణీ చేశారు. నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియం రోడ్డులో మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌ను నివారించడం వంటి అంశాలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్స్, పిరమిడ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిన ఆనంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు కాటేపల్లి శైలజ, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, ఉదయలక్ష్మి తదితరులు జ్యూట్ బ్యాగులను, మొక్కలను పంచారు.

మొక్కలు నాటిన ఎంపీడీఓ..



భైరవునిపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం, భైరవునిపల్లి, రాజేశ్వరపురం, నాచేపల్లిలోని అమృత సరోవర్ చెరువుల వద్ద ఎంపీడీఓ ఎం.యర్రయ్య మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ హితానికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సునీత, ఈసీ శేషగిరిరావు, టీఏ, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నేలకొండపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గ్రీన్ వే ఎన్విరాన్‌మెంట్ ఆధ్వర్యాన మొక్కలు నాటగా.. ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.ఆమోస్, సొసైటీ అధ్యక్షుడు దుద్దెల రవికుమార్, కాసాని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్..

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కరాటే నేర్చుకునే చిన్నారులచే మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకట్, మంద వెంకటేశ్వర్లు, తోటపల్లి కాశ్వీ, వెంకట్, సుదర్శన్, భాస్కర్, రవి, హరిబాబు, కరాటే మాస్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం..



మొక్క నాటుతున్న ఏపీడీ వెంకటపతిరాజు

కామేపల్లి: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఏపీడీ వెంకటపతిరాజు అన్నారు. బుధవారం ఈజీఎస్ శాఖ ఆధ్వర్యాన మొక్కలను నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ తారాదేవి, ఏపీఓ శ్రీరాణి, కార్యదర్శి అనిల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లకారం ట్యాంక్ బండ్‌పై అవగాహన..



సదస్సులో పాల్గొన్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, కేఎంసీ ఏఈలు నవ్యజ్యోతి, బాబురావు, రామిరెడ్డి, మంచుకొండ పీఏసీఎస్ చైర్మన్ మందడపు సుధాకర్, సిటీ టెర్రస్ గార్డెన్ గ్రూప్ బాధ్యులు మానుకొండ జ్యోతి, బత్తుల సరోజని, వాసిరెడ్డి నిర్మల, షేక్ కైసర్, కొణిదెన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా టెర్రస్ గార్డెన్ ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

కేంద్రీయ విద్యాలయంలో వనజీవి..



మొక్క నాటుతున్న వనజీవి రామయ్య

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రీయ విద్యాలయంలో బుధవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మొక్కలు నాటారు. అనంతరం వనజీవి మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రభుత్వాలు కూడా మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ కవింద్ర రాయ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సెడార్ వ్యాలీ స్కూల్‌లో..



పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలోని సెడార్ వ్యాలీ స్కూల్ ఆవరణలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్కూల్ కరస్పాండెంట్ పి.రవిమారుత్, హార్వెస్ట్ ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డితోపాటు బుగ్గవీటి ఉదయశ్రీ, డాక్టర్ పీ.ఎస్.వీ.ఎస్.వీ.ప్రసాద్, డాక్టర్ రావెళ్ల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

జనసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం మామిళ్లగూడెం: మాదిగల జనసభ పోస్టర్లను బుధవారం హైదరాబాద్‌లో మంత్రి క్యాంప్ కార్యాలయంలో మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అధ్యక్షతన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడమర్తి మాట్లాడుతూ.. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధన లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 7 నుంచి జనసభ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ, అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వక్కల గడ్డచంద్రశేఖర్ మాదిగ, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డి యాదయ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జెల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'లో ప్రకృతి ప్రతిభ



ప్రకృతి

కూసుమంచి: నీట్ ఫలితాల్లో కూసుమంచికి చెందిన వడ్లమూడి ప్రకృతి ప్రతిభ చాటింది. ఆమె 720 మార్కులకు గానూ 651 మార్కులు సాధించింది. ప్రకృతి తండ్రి వెంకటేశ్వర్లు కూసుమంచిలో సీఆర్పీగా, తల్లి స్వరూప ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, పాలేరులోని జవహర్ నవో దయ విద్యాలయలో పదో తరగతి పూర్తిచేసి హైదరాబాద్‌లో ఇంటర్ చదివింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈఓ బీవీ.రామాచారి, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, హెచ్ఎం రాయల వీరస్వామి తదితరులు అభినందించారు.

నిరంతరాయ విద్యుత్‌కు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎస్ఈ సురేందర్, అధికారులు, ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: నగరంలో విద్యుత్ సమస్యను అధిగమించేందుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణానికి టీజీ ఎన్పీడీసీఎల్ ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పటికే నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులోని సబ్ స్టేషన్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన సంస్థ, ఇల్లెందు క్రాస్‌రోడ్డులోని 33/11 సబ్ స్టేషన్‌లో తొలిసారిగా 12.5 ఎంవీఏ(మెగా ఓల్ట్ యాంప్) సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సబ్ స్టేషన్లలో సాధారణంగా 8 ఎంవీఏ, 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటుండగా.. నగరం విస్తరించడం, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల ఏర్పాటు, గృహ, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు గణనీయంగా పెరగడంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మమత రోడ్డులో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణలో ఉండగా.. మరో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మించారు. అలాగే ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 సబ్ స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏ ట్రాన్స్ ఫార్మర్లతో నిర్వహణలో ఉండగా.. ఒకదాన్ని తొలగించి రూ.1.25 కోట్ల వ్యయంతో 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో నగరంలో విద్యుత్ సమస్యలు, అంతరాయాలు పరిష్కరించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఎ.సురేందర్, ఖమ్మం టౌన్ ఆపరేషన్స్ డీఈ నంబూరి రామారావులతో కూడిన బృందం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనితీరును పర్యవేక్షించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బందెల వెంకయ్య

కూసుమంచి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు సంఘటితం కావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య పిలుపునిచ్చారు. బుధవారం పాలేరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ప్రభుత్వం బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాలను తీసుకొస్తుందని, ఇందుకు వ్యతిరేకంగా తమ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ నెల 8న పాలేరులో నిర్వహించే ఇఫ్టూ పాలేరు ఏరియా కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. గౌసు పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, పోటు నాగేశ్వరరావు, చేపల సత్యనారాయణ, కొమ్ము రోషయ్య, మచ్చునాయక్, వీరయ్య, గురువారెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలి



రాయగూడెంలో ప్రచారం చేస్తున్న ఓదెలు

నేలకొండపల్లి: సాంఘిక, సంక్షేమ వసతి గృహాలను సద్వినియోగం చేసుకోవాలని చెరువుమాధారం ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారి ఆర్.ఓదెలు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వసతి గృహాలలో చేరాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రధాన సెంటర్, ప్రభుత్వ పాఠశాలల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థులను చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులను కోరారు. అడ్మిషన్లు ప్రారంభమైనందున ఆసక్తి గల వారు ఆధార్ కార్డు జిరాక్స్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, నాలుగు పాస్‌ఫొటోలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.